నలుగురు గూండాలు

టెంపోరావ్

ఫైవ్ స్టార్ హోటల్ సీవ్యూముందు హాల్లోని సోఫాలో కూర్చున్నాడు పీటర్స్. విశాలమైన హాలు. దూరంలో రిసెప్షన్ కౌంటర్ వెనక అరడజనుమంది యువతులు బిజీగా వున్నారు.

పీటర్స్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. తనీ హోటల్లో దిగి వారంరోజులు దాటింది. కానీ తను ఆశించినదేదీ యింతవరకూ కాలేదు. త్వరలో తను మరో చౌకబారు హోటలికి మారిపోవాలి.

పీటర్స్ కింగ్ సైజు సిగరెట్‌ను పెదిమల మధ్యవుంచి, అగ్గిపెట్టెకోసం జేబులు వెతకసాగాడు. తటాలున ఏదో లైటర్ వెలిగింది. అతని సిగరెట్ అంటుకుంది. లైటర్ పట్టుకున్న వ్యక్తివంక అతడు సీరియస్‌గా చూశాడు.

యువకుడు. పచ్చగా, అందంగా వున్నాడు. సూటులో వున్నాడతను. అతడు తనకు వుపయోగపడొచ్చు.

"సిగరెట్ ప్లీజ్," అన్నాడు పీటర్స్.

ఆ యువకుడు సిగరెట్ తీసుకొని వెలిగించాడు. పొగ వదులుతూ పీటర్స్ వంక చూశాడు.

"నా పేరు మోహన్" అన్నాడతను.

"ఐయామ్ పీటర్స్," పరిచయం చేసుకున్నాడతను.

"మీరు ఒంటరిగా కూర్చున్నారు. అందుకే యిక్కడి కొచ్చాను" అన్నాడు మోహన్.

"గుడ్, ఐ లైక్ కంపెనీ," అన్నాడు పీటర్స్.

బయట మెర్సిడిస్ కారు ఆగింది. ఒక స్త్రీ కిందకు దిగింది. హోటల్ మేనేజర్ భట్ పరిగెత్తుకెళ్ళి ఆమెకు నమస్కరించాడు. ముగ్గురు హోటల్ నౌకర్లు కారులోని ఆమె సామానులను తీసుకొన్నారు. పీటర్స్, మోహన్ కూర్చున్న సోఫా పక్కనుంచి ఆమె కదుల్తోంది.

"సూట్ నంబర్ 88 మీకోసం రిజర్వు చేసి వుంచాం, మిసెస్ బెనర్జీ," అన్నాడు హోటల్ మేనేజర్.

"ఫైన్," అందావిడ.

పీటర్స్ ఆమెవంక సూటిగా చూశాడు. ఆమెచాలా ధనవంతురాలై వుండాలని పీటర్స్ క్షణంలో గ్రహించాడు. ఆమె వయస్సు నలభైఅయిదుపైన వుంటుంది. కాని ఆమె బాగా మేకప్ చేసుకొంది. ముప్ఫయ్యేళ్ళ స్త్రీలా చూసేవాళ్ళకు కనిపిస్తోంది. ఎంత వయసొచ్చినా డబ్బు వయస్సును తగ్గించగలదు.

ఆమె లిఫ్ట్‌లో పైకి వెళ్ళిపోయింది. హోటల్ మేనేజరు భట్ వెనక్కి తిరిగివస్తూ పీటర్స్ పక్కనే ఆగాడు. పీటర్స్ అతనికి నమస్తే చెప్పి ఆవిడ్ని గురించి అడిగాడు.

"ఆమె మిసెస్ బెనర్జీ. సంవత్సరం క్రితం ఆమె భర్త చనిపోయాడు. ఆమెకు యీ దేశంలో ఎన్నో ఫ్యాక్టరీలున్నాయి. ఆమె ఆస్తి నూరుకోట్లకు పైన వుంటుంది,"

అన్నాడు భట్ సగర్వంగా.

"పెద్దవాళ్ళు మీ హోటల్లో నే దిగుతారు," అన్నాడు పెటర్స్.

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్" అని భట్ వెళ్ళిపోయాడు.

పీటర్స్ మెదడు తీవ్రంగా ఆలోచిస్తోంది. మిసెస్ బెనర్జీ తల్చుకుంటే తన కంపెనీ విజయవంతంగా సాగుతుంది. కాని ఆమెను ఎలా పట్టుకోవడం?

పీటర్స్ చూపు పక్కనకూర్చున్న మోహన్ మీదకు వెళ్ళింది. అతడి వంక చూస్తూంటే ఏదో టార్చిలా పీటర్స్ మెదడులో మెరిసింది.

"మిస్టర్ మోహన్, మీరు యెక్కడుంటున్నారు? ఇదే హోటల్లోనా?"

"నో!" అన్నాడు మోహన్.

పీటర్స్ నవ్వాడు. మోహన్ వంక చూశాడు.

"మీరు బిజీగా లేరుగా?"

"ఎందుకలా అడుగుతున్నారు?" ప్రశ్నించాడు మోహన్.

"వీలయితే మీరు నాతో డిన్నర్ సేవిస్తే సంతోషిస్తాను. నేను యిదే హోటల్లో వుంటున్నాను. రూమ్ నెంబర్ 33," అన్నాడు పీటర్స్.

మోహన్ మరో సిగరెట్ను పీటర్స్ పాకెట్ నుంచి తీసుకొని వెలిగించాడు. "నేను నా ఫ్రెండ్ కోసం చూస్తున్నాను. ఏ క్షణంలోనయినా అతడు రావచ్చు" అన్నాడు మోహన్.

పీటర్స్ సోఫాలోంచి లేచాడు. తన సిగరెట్ పాకెట్టును సోఫాలో మర్చిపోయినట్లు వదిలేశాడు.

"మిస్టర్ మోహన్, మీ ఫ్రెండ్‌తో మాట్లాడాక నా గదికి రండి. మీకోసం ఎదురుచూస్తూ వుంటాను."

"ప్రయత్నిస్తాను," అన్నాడు మోహన్.

పీటర్స్ వెళ్ళిపోయాడు. సోఫాలో వున్న సిగరెట్ పాకెట్‌ను మోహన్ తీసి జేబులో దాచుకున్నాడు. సోఫాలో కూర్చుని నలువైపులా చూశాడు. తనకోసం యెవరో రావడం అబద్ధమని అతడికి తెలుసు. పాకెట్ లోంచి మరో సిగరెట్ తీసి అతడు వెలిగించాడు.

అరగంట దాటాక అతడు లిఫ్ట్‌లో పైనున్న 13 గదికి వెళ్ళాడు.

సోఫాలో కూర్చుని స్కాచ్ విస్కీ తాగుతున్న పీటర్స్ అతడివైపు నవ్వుతూ చూశాడు.

"కమాన్, మై ఫ్రెండ్. జాయిన్ ఇన్ డ్రింక్స్?" అన్నాడతను.

ఒక గ్లాసులో విస్కీ పోసి, సోడా కలిపి పీటర్స్ అతడికి అందించాడు.

"చియర్స్!" అని మోహన్ తాగడం ప్రారంభించాడు.

నిమిషాలు గడిచిపోతున్నాయి. ఇద్దరూ బాగా తాగారు. "మిస్టర్ మోహన్, మీరు ఏం చేస్తున్నారు?" అడిగాడు పీటర్స్.

"ప్రస్తుతం ఏ పనిలోనూ లేను" అన్నాడు మోహన్.

"నా కంపెనీ తరఫున మీరు పని చేయచ్చు" పీటర్స్ అన్నాడు.

"ఏం చెయ్యాలో చెప్పండి."

"నేనీ మధ్యనే టూరిస్టు హోమ్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఫ్లాట్ చేశాను. కనీసం పదిలక్షలుంటేగాని నా

స్కీము జయించదు. మీరు నా కంపెనీ షేర్ల నమ్మాలి. పదిలక్షలు పెట్టగల్గిన వ్యక్తిని మీరు కల్సుకోవాలి."

"పదిలక్షలు ఎవరు పెట్టగలరు?" అన్నాడు మోహన్ ఆశ్చర్యంగా.

పీటర్సన్ సిగరెట్ వెలిగించాడు.

"ఎవరు అంత మొత్తం పెట్టగలరా అని నేనూ ఆలోచిస్తూన్నాను. కాని యివాళ మిసెస్ బెనర్జీని చూశాక ఆమె పెట్టగలదనే నమ్మకం నాకు యేర్పడింది. మీరు ఆమెను కల్సుకోవాలి. ఆమెచేత నా కంపెనీలో డబ్బు పెట్టించాలి" అన్నాడు పీటర్సన్.

"అంత సులువైన పనికాదు," అన్నాడు మోహన్.

గ్లాసులోని విస్కీని పీటర్సన్ పూర్తిగా తాగేశాడు. "మిస్టర్ మోహన్, నేను హోటల్ మేనేజర్ భట్‌తో మాట్లాడాను. మిసెస్ బెనర్జీకి మగవాళ్ళంటే పిచ్చి. మిమ్మల్నిచూస్తే ఆమె మీ కోసం కొంగ జపం చేస్తుంది"

మోహన్ మాట్లాడలేదు. విస్కీ తాగి సిగరెట్ వెలిగించాడు.

"మిస్టర్ మోహన్, ఆమెభర్త మరణించాడు. ఆమె దగ్గర చెప్పలేనంత డబ్బువుంది. రాత్రిళ్ళు ఆమె ఒంటరిగా పడుకోలేదు! మగతోడు కావాలి," అన్నాడు పీటర్సన్.

"చూద్దాం," అన్నాడు మోహన్.

"చూద్దాం అంటేకాదు. మీరు ఆమెను ఆకర్షించడానికి ప్రయత్నించాలి. అందుకోసం నేనన్ని విధాలా సహాయపడ్తాను," అన్నాడు పీటర్సన్.

"ఏ విధంగా?"

"నీకు నెలకు వెయ్యిరూపాయలు జీతం యిస్తాను. ఆమె నా కంపెనీలో డబ్బుపెడితే నీకు యాభయివేలు కమీషన్‌గా యిస్తాను," అన్నాడు పీటర్స్ ఏకవచనంలోకి దిగుతూ.

మోహన్ కాస్సేపు ఆలోచించాడు.

"ఆమెకోసం నేను ప్రయత్నించాలంటే కనీసం రెండు మూడువేలు నాకు కావాలి. నేనెంతో వున్నవాడిలా ఆమెముందు నటించాలి," అన్నాడు మోహన్.

పీటర్స్ తన బాగ్ తెర్చి రెండువేలు తీసి మోహన్‌కి యిచ్చాడు.

"ఈ డబ్బు తీసుకో. చెయ్యవలసినదంతా నువ్వు చెయ్యి."

మోహన్ డబ్బును పాంటు జేబులో దాచుకున్నాడు.

"ఐ విల్ ట్రై!" అన్నాడు మోహన్.

"ఇంత డబ్బిచ్చాక నువ్వు జయించాలి. ప్రయత్నిస్తానంటే లాభంలేదు," అన్నాడు పీటర్స్.

"మిస్టర్ పీటర్స్, నా సాయశక్తులా కృషి చేస్తాను" అన్నాడు మోహన్.

2

మిసెస్ జెనక్జి హోటల్ ముందున్న మెర్సిడీస్ కారులో ఎక్కింది. కారు స్పీడుగా వెళ్ళిపోయింది.

"ఎక్కడికెళ్ళాలమ్మా?" అడిగాడు డ్రయివర్.

"హోటల్ జీరోకి పద," అందామె.

హోటల్ జీరో కాంపౌండ్‌లో కారు ఆగింది. ఆమె దిగి లోపలకు వెళ్ళింది. పైనున్న రూఫ్ గార్డెన్ రెస్టారెంట్‌లోకి వెళ్ళి ఒంటరిగా ఒక కుర్చీలో కూర్చుంది. రూఫ్ గార్డెన్ అఖండంగా వుంది.

నలువైపులా పూలకుండీలు. గులాబీ పుష్పాలవైపు ఆమె ఆనందంగా చూసింది. ఆమె ఆలోచిస్తోంది. తన భర్త బెనర్జీ చనిపోయి సంవత్సరం అయింది. కావల్సినంత డబ్బు తన చేతుల్లో వుంది. కాని తనకు సుఖంలేదు. జీవితం భారంగా సాగుతోంది.

రెస్టారెంట్ బాయ్ ఆమె పక్కకొచ్చాడు.

"ఏం కావాలి, మేడమ్?" అడిగాడతను.

ఆమె అతడివైపు చూసింది. అతడి వయస్సు యిరవై పైన వుంటుంది. మనిషి అందంగాలేడు.

"చికెన్ బిర్యానీ!" అందామె.

బాయ్ వెళ్ళిపోయాడు.

ఆమె ఒంటరిగా కూర్చుంది. ఒక యువకుడు ఆమె టేబుల్ వైపు ఠీవిగా నడుస్తూ వచ్చాడు. ఆగి ఆమెవైపు చూశాడు, నవ్వుతూ.

అతడి పళ్ళు ముత్యాల్లా మెరుస్తున్నాయి. చాలా అందంగా వున్నాడతను.

"మేడమ్, ఇక్కడ కూర్చోవచ్చా?" అన్నాడతను.

"ప్లీజ్, సిట్" అందామె.

ఆమె ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడతను.

"ఐయామ్ మోహన్!" అన్నాడతను.

"ఐయామ్ మిసెస్ బెనర్జీ! నా పేరు కమల," అన్నదామె.

"మిసెస్ బెనర్జీకంటే కమల పేరు బాగుంది" అన్నాడతను.

"కమల నా అసలు పేరు. ఆ పేర్తోనే నువ్వు పిలవచ్చు," అందామె.

"థాంక్స్," అన్నాడతను.

రెస్టారెంట్ బాయ్ మళ్ళా వచ్చాడు. అతడు ఆర్డ రిచ్చాడు.

ఇద్దరూ తింటూ మాట్లాడుకో సాగారు.

"నువ్వేం చేస్తున్నావు?" అడిగిందామె.

"టూరిస్టు హోమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పని చేస్తున్నాను," అన్నాడతను.

"గుడ్," అందామె.

"మీరు యెక్కడికెళ్ళాలి? నా కారులో మిమ్మల్ని తీసుకెళ్తాను," అన్నాడతను.

"అలాగే, నీ కారులోనే వస్తాను," అందామె.

ఆమె అతడివైపు నవ్వుతూ చూసింది.

"మిస్టర్ మోహన్, నన్ను 'మీరు' అనొద్దు. ఏక వచనంలో నాతో మాట్లాడు," అందామె.

గంట తర్వాత బాయ్ బిల్లు తెచ్చాడు. అతడు బిల్లు చెల్లించాడు. ఆమెతో అతడు బయటకు నడిచాడు. అతడి ఫియట్ కారులో ఆమె ముందుసీటుమీద కూర్చుంది. అతడు కారుని పోనిచ్చాడు. ఆమె ఆలోచిస్తోంది. తన డ్రయివర్ చివరకి తన హోటల్ కి వస్తాడు!

ఫియట్ కారు వేగంగా కదుల్తోంది.

"నువ్వెక్కడి కెళ్ళాలి?" అన్నాడతను.

"హోటల్ సీవ్యూ," అందామె.

"గ్రేట్ హోటల్," అన్నాడతను.

అతడామెను ముట్టుకోడానికి ప్రయత్నించలేదు. పెద్ద మనిషిలా కారును పోనిచ్చి సీవ్యూకాంపౌండ్ లో ఆపాడు. ఆమె కిందకి దిగింది.

"నేను సూట్ నెంబర్ 88లో వున్నాను. నా సూట్ కి రాకూడదూ?" అందామె.

"సారీ, నాకు పనుంది. రేపొస్తాను," అన్నాడతను.

విచారంగా ఆమె అతడికి బై బై చెప్పింది. షియట్ కారు వెళ్ళిపోయాక ఆమె హోటల్ లోపలకు వెళ్ళింది.

హోటల్ ముందుహాల్లో కూర్చున్న పీటర్స్ ఒంటరిగా వెళ్తూన్న ఆమెవంక నవ్వుతూ చూశాడు.

3

మోహన్ తలుపుమీద తట్టాడు.

"కమిన్!" అరిచాడు పీటర్స్.

అతడు లోపలకు వెళ్ళి తలుపుమూశాడు. పీటర్స్ సోఫాలో కూర్చొని దినపత్రిక చదువుతున్నాడు.

"గుడ్ మార్నింగ్!" అన్నాడు మోహన్.

"గుడ్ మార్నింగ్, కూర్చో! నీ కోసమే చూస్తు న్నాను."

మోహన్ పక్క సోఫాలో కూర్చుని టీపాయిమీదున్న సిగరెట్ పాకెట్ లోంచి సిగరెట్ తీసి వెలిగించాడు. పొగ వదులూ అతడివంక చూశాడు.

"ఆమెను కల్సుకున్నాను" అన్నాడు మోహన్.

"చూశాను!" అన్నాడు పీటర్స్ క్లుప్తంగా.

క్షణకాలం గదిలో నిశ్శబ్దం తాండవించింది.

"మన కంపెనీ విషయం మాట్లాడావా?"

"ఆ విషయం మొదలే ఎత్తితే ఆమె నన్ను దగ్గరకు రానివ్వదు" అన్నాడు మోహన్.

"మనకు కావలసింది డబ్బు, ఆమెకు దగ్గరవడంకాదు!"

"మిస్టర్ పీటర్స్, నా ప్లాన్ ప్రకారం నేనంతా చేస్తాను. మీరు నన్ను తొందరపెట్టకూడదు!"

"ఆల్ రైట్, గో ఎహెడ్!"

మోహన్ అతడివైపు సూటిగా చూశాడు.

"నాకు మరో రెండువేలు కావాలి."

"నా దగ్గర నోట్లను ముద్రించే మిషన్ లేదు! నేను నీ కిచ్చినది పూర్తయేలోపల నువ్వు అంతా సాధించాలి."

"ఐయామ్ సారీ, అది వీలుపడదు! థియేటర్ కారుకు గ్యారేజుకు రెండువందలు అద్దె యివ్వాలి. కారు నాకు అద్దెకిచ్చిన కంపెనీ వాళ్ళకు అయిదురోజుల అద్దె ముందుగా యిచ్చాను. నా పాత బాకీల వగైరా తీర్చాక ప్రస్తుతం నా దగ్గర వందరూపాయలుంది. ఇవాళ ఆమెను కల్సుకోవాలి. ఎక్కడెక్కడికో ఆమెను తీసుకెళ్ళాలి!"

పీటర్స్ చిరాకుగా అతడివైపు చూశాడు.

"ఆమెను గదికెళ్ళి కల్సుకో! అప్పుడు డబ్బు ఖర్చు వుండదు. నీ దగ్గరున్న వందరూపాయలు చాలు."

"అయితే నేను పని మానుకుని నా హోటల్ కి పోవాలి!"

గాభరాగా పీటర్స్ అతడివంక చూశాడు.

"తొందరపడకు. మరో వెయ్యి యిస్తాను. దానితో పని కానీ!"

"యింపాసిబుల్."

పీటర్ సోఫాలోంచి లేచి గాడ్ రెజ్ బీరువా దగ్గరకు వెళ్ళాడు. కాసేపట్లో తిరిగొచ్చి రెండువేలు మోహన్ కి యిచ్చాడు.

"మళ్ళా డబ్బుకోసం యీ గదిలోకి రావద్దు!" అరిచాడు పీటర్స్.

మోహన్ తీయగా నవ్వాడు.

"మిస్టర్ పీటర్స్, నేను జయిస్తే మీ చేతుల్లోకి పది లక్షలు వస్తాయి. నా పని సఫలం కావడానికి పెట్టుబడి లేకుండా ఏ ప్రయత్నమూ ఫలించదు!" అన్నాడు మోహన్.

"అదంతా నాకు తెలుసు! పని తొందరగా కానీ! నేనీ హోటల్ కి వచ్చి చాలా రోజులైంది. హోటల్ బిల్లు నన్ను తినేస్తుంది!"

"డోంట్ బాదర్" అని మోహన్ సోఫాలోంచి లేచాడు.

"మళ్ళా ఎప్పుడు కనిపిస్తావు?"

మోహన్ పకపకా నవ్వాడు.

"డబ్బు కావలసినప్పుడు."

"మిస్టర్ మోహన్, బి సీరియస్! వ్యాపారంలో జోక్స్ ఐ డిస్ లైక్!" అన్నాడు పీటర్స్ చిరాకుగా.

గుమ్మందాకా వెళ్ళి మోహన్ వెనక్కి తిరిగి పీటర్స్ వైపు చూశాడు. పీటర్స్ పొట్టిగా, లావుగా, నల్లగా వున్నాడు. అతడి కళ్ళు ఎర్రగా మెరుస్తున్నాయి. కళ్ళు చూడగానే అతడు తాగుబోతని అందరూ వూహిస్తారు. బట్టతల.

"మిస్టర్ పీటర్స్, మీలా నేను సీరియస్ గా వుంటే యీ పనిలో జయించలేను. నవ్వుతూ, పాడుతూ వుంటే గాని మిసెస్ బెనర్జీని నేను ఆకర్షించలేను!" అని మోహన్ తలుపు తెరుచుకుని బయటకు వుషారుగా వెళ్ళి పోయాడు.

4

మిసెస్ బెనర్జీ స్నానం చేసి, బాగా ముస్తాబై పడగ్గది లోని అద్దం ముందు నిలబడి తన ప్రతిబింబాన్ని చూసుకో సాగింది.

మోహన్ ఆమెకు జ్ఞాపకొచ్చాడు. చాలా అందమైన యువకుడు. అతడికి పెళ్ళయిందో లేదో తను కనుక్కో వాలి. గతరాత్రి ఆమెకు నిద్రపట్టలేదు. రెండు గంటల

దాకా ఆమె మేలుకొనే వుంది. టేప్ రికార్డర్ ని ఆన్ చేసి పాటలు వింటూ కూర్చుండిపోయింది. రెండు తర్వాత ఆమెకు తెలియకుండానే నిద్రపట్టేసింది.

తనతో చెప్పినట్లు మోహన్ మళ్ళా వస్తాడా? తనని కల్సుకుంటాడా? తనను గురించి ఆమె ఏమీ అతడితో చెప్పనందుకు మిసెస్ బెనర్జీ విచారించింది. పాపం, అతడు హోటల్ బిల్లుకూడా చెల్లించాడు. మళ్లా అతను కనిపించదేమో!

గదిలో వున్న టెలిఫోన్ మ్రోగింది. ఆమె వెళ్ళి రిసీవర్ని ఆత్రంగా అందుకుంది.

"హలో, మిసెస్ బెనర్జీ స్పీకింగ్!" అందామె.

"నేనమ్మగారూ, పేర్రాజుని" అందో కంఠం అటువైపునుంచి.

క్షణకాలం నిరాశతో ఆమె గది నలువైపులా చూసింది. పేర్రాజు! మద్రాసులో తన కంపెనీల రీజనల్ మేనేజర్. అతడంటే ఆమెకు పరమ అసహ్యం. కంపెనీల విషయాలు చెప్పి బోరుకొడ్తాడు.

"పేర్రాజుగారూ, నాతో మాట్లాడాలా?" అందామె.

"ఆ వుద్దేశంతోనే హోటల్కి వచ్చాను. రిసెప్షన్ హాల్లోంచి మీతో మాట్లాడుతున్నాను. కంపెనీ విషయాలు ఎన్నో చర్చించాలి!"

"నేను నిన్న వచ్చాను. అలసటగా వుంది. మీరు ఆఫీసుకు వెళ్ళండి. ఇవాళో, రేపో నేను అక్కడికొస్తాను" అందామె.

"మస్కట్ కాంట్రాక్ట్ మనకు వచ్చింది. ఈ కాంట్రాక్ట్ మనకు వచ్చేందుకు నేను చాలా ప్రయత్నిం

చాను. మస్కట్ వెళ్ళి అక్కడ వుండి అంతా సాధిం చాను. ఈ కాంట్రాక్ట్ విలువ యాభై కోట్లు!"

"గుడ్ వర్క్! అంతా నేను ఆఫీసుకొచ్చి మాట్లాడు తాను, బై బై" అని ఆమె రిసీవర్ని పెట్టేసింది.

పేర్రాజు ఫెవికల్ లాంటి వ్యక్తి. వింటూ వుంటే అలా చెప్తూనే వుంటాడు.

మరోసారి తన రూపాన్ని అద్దంలో చూసుకుని ఆమె సోఫాలో కూర్చుంది.

మోహన్ రూపం ఆమె మెదడులో తిరుగుతోంది. ఆమె తన వాచ్ వైపు చూసింది. టైమ్ పది దాటింది. మోహన్ ఎక్కడుంటున్నాడో తను కనుక్కోలేదు. నిజం చెప్పాలంటే అతడు తన సమీపంలో వున్నంతసేపూ ఆమె ఈ లోకంలో లేదు. తీయటి అతడి మాటలు వింటూ ఆమె పూర్తిగా మర్చిపోయింది.

వెళ్ళిపోతూ మోహన్ అన్న ఆఖరి మాటలు ఆమెకు బాగా గుర్తున్నాయి. మిసెస్ బెనర్జీ ఆలోచించడం మాని టీపాయ్ మీదున్న అమెరికన్ ప్లేబాయ్ పత్రికను తిర గేస్తూ కూర్చుంది. ఆ పత్రిక హిందూదేశంలో దొరకడం కష్టం. ఒక స్మగులర్ ఆ పత్రికను ఎన్నేళ్ళగానో ఆమెకు సప్లయి చేస్తున్నాడు.

రంగురంగుల బొమ్మలవయిపు ఆమె చూస్తోంది. కాని ఆమె మనస్సు పత్రికమీద లేదు. మోహన్ రూపం పత్రిక లోంచి ఆమెకు గోచరిస్తోంది.

గదిలోని టెలిఫోన్ మ్రోగింది. మిసెస్ బెనర్జీ అమాం తంగా సోఫాలోంచి లేచి, ఏదో ఆలోచనతట్టి తిరిగి సోఫాలో కూర్చుండిపోయింది. తన కంపెనీల రీజనల్ మేనేజర్ పేర్రాజు యింకా రిసెప్షన్ హాల్లోంచి వెళ్ళి

పోయుండడు. ఆ జిడ్డు మనిషి తనకు మళ్ళా ఫోన్ చేసి వుండొచ్చు. తను రిసీవర్ తీయకపోతే, ఏదో పనిలో వుందని భావించి అతడు వెళ్ళిపోతాడు. శని విరగడవుతుంది.

తన భర్త బెనర్జీ ఆమెకు జ్ఞాపకొచ్చాడు. అతడు దేశ వ్యాప్తంగా యిన్ని కంపెనీలు స్థాపించి అన్నింటినీ ఎలా చూసేవాడో! టెలిఫోన్ యింకా మ్రోగుతూనే వుంది. రిసీవర్ తీసి పేర్రాజును గట్టిగా తిట్టాలి. మళ్ళా ఫోన్ చెయ్యవద్దని చెప్పాలి.

సోఫాలోంచి లేచి ఆమె రిసీవర్ను అందుకుంది.

“హలో!” అంది విసుగ్గా.

“ఆయామ్ మోహన్” అందొక కంఠం తీయగా.

ఆమె గుండె దడదడ కొట్టుకుంది. ఆమె వళ్ళు ఒణుకుతోంది.

“నీకోసమే ఎదురు చూస్తున్నాను” అంది.

“నన్ను క్షమించాలి. నేను ఈవేళ నీ దగ్గరికి వస్తానన్నాను. కాని రాలేను. మా కంపెనీ పనితో బిజీగా వున్నాను.”

వెధవ కంపెనీలు! ఈ కంపెనీల పనుల్లో యిరుక్కుని మానవులందరూ బానిసలయి పడుంటున్నారు.

“మోహన్, నువ్వెక్కడున్నావు?” అడిగిందామె.

“ఒక హోటల్లోంచి నేను నీతో మాట్లాడుతున్నాను.”

“మోహన్, ఆ హోటల్ పేరు చెప్పు. నేనక్కడికొస్తాను. నీతో మాట్లాడాలి.”

“ఇది చాలా చిన్న హోటల్. ఇక్కడకు నువ్వు రావద్దు.”

“హోటల్ బయట నువ్వు నిలబడు. నేనొస్తాను.”

“అయితే తొందరగా రా. ఈ హోటల్ మౌంట్

రోడ్డులో వుంది. పేరు నెప్రాహా హోటల్. పేవ్ మెంట్ మీద నిలబడి నీకోసం ఎదురుచూస్తూ వుంటాను."

"వెంటనే వస్తున్నా. వెయిట్ ఫర్ మి" అని ఆమె రిసీవర్ని పెట్టేసింది.

హేండ్ బాగ్ పట్టుకుని ఆమె బయటకు నడిచింది. నడవలో డ్రైవర్ ప్రత్యక్షమయ్యాడు. ఆమె అతడివైపు నవ్వుతూ చూసింది.

"మస్తాన్, నాకు కారక్కర్లేదు. నువ్వు యిక్కడే వుండు" అని ఆమె లిఫ్ట్లో కిందకు వెళ్ళిపోయింది. రిసెప్షన్ హాల్లోంచి బయటకు వెళ్తూ ఆమె నలువైపులా చూసింది. హోటల్ మేనేజర్ భట్ వినయంగా ఆమె వైపు పరుగెత్తుకొచ్చాడు.

"మిసెస్ బెనర్జీ, మీ కారు తెప్పించనా?" అడిగాడతను.

"నో ప్లీజ్, టాక్సీలో వెళ్తాను" అందామె.

ఆమెకంటె ముందు భట్ బయటకు పరుగెత్తాడు. హోటల్ మోజాయిక్ మెట్లు ఆమె దిగేసరికి అందమైన టాక్సీ సిద్ధంగా వుంది. టాక్సీ వెనక తలుపును భట్ తెరిచి పట్టుకున్నాడు. ఆమె సీటుమీద కూర్చోగానే భట్ తలుపు మూశాడు.

టాక్సీ గేటువైపు దూసుకుపోయింది. ఆమె యిరువైపులా చూసింది. కారులో కూర్చున్న పేర్రాజు రూపం ఆమెకు కనిపించింది. ఆమె కోపంగా తలను పక్కకి తిప్పేసుకుంది. ఈ జిడ్డుగాడింకా యిక్కడే వున్నాడు.

"డ్రైవర్, మౌంట్ రోడ్డులోని నెప్రాహా హోటల్ కి పద."

"అలాగేనమ్మా!" అన్నాడు డ్రయివర్ వినయంగా.

5

హోటల్ ముందు ఆగిన టాక్సీలోంచి ఆమె దిగింది. ఎంతని డ్రయివర్ని అడిగింది. ఐదు రూపాయలు అన్నాడతను.

హేండ్ బాగ్ లోంచి పదిరూపాయిల నోటు తీసి అతడికిచ్చింది.

"వుండమంటే వుంటానమ్మా!" అన్నాడు డ్రయివర్.

వెళ్ళిపొమ్మని ఆమె డ్రయివర్ కి సౌజ్ఞ చేస్తూ నలువైపులా చూసింది.

పేవ్ మెంట్ మీద కొంచెం దూరంలో మోహన్ నిలబడి వున్నాడు.

టాక్సీ వెళ్ళిపోయాక ఆమె అతడివైపు నడిచింది.

"నీ కారెక్కడ?" ప్రశ్నించిందామె.

సమీపంలోవున్న ఫియట్ వైపు అతడు చూపించాడు.

"కారులో పోదాం. పద" అందామె.

ఆమె ముందుసీటులో కూర్చుంది. మోహన్ కారును పోనిచ్చాడు. ఓరగా అతడామెవంక చూశాడు. ఆమె ధరించిన దుస్తులు చాలా ఖరీదైనవి. విదేశీ సెంటు సువాసన అతడివైపు కొడ్తోంది. లిప్ స్టిక్ తో ఆమె పెదిమలు ఎర్రగా మెరుస్తున్నాయి. ఆమె మెళ్ళోని డైమండ్ నెక్లెస్ ధగధగ మెరుస్తోంది.

"దూరంగా, యీ పిచ్చిలోకానికి దూరంగా పోదాం" అందామె.

"కంపెనీ పని మాని అలా తిరిగితే నా వుద్యోగం పోతుంది!" అన్నాడతను నవ్వుతూ.

"నీ వుద్యోగం పోతే బాధపడేవాళ్ళు చాలామంది వున్నారా?"

"ఎక్కువమంది లేకపోవచ్చు! మా వూళ్ళో అమ్మ మాత్రం వుంది. ఆమెకు ప్రతినెలా వంద పంపాలి!"

ఆమె సంతోషించింది. అతడికింకా పెళ్ళికాలేదు.

"అంతేనా?" అందామె.

"నా స్వంత ఖర్చు వుందిగా! బ్రహ్మచారిగా జీవించే వాడికి ఖర్చు ఎక్కువ!" అన్నాడు మోహన్.

"నీకు చాలామంది గర్ల్ ఫ్రెండ్స్ వున్నారా?"

అతడు ఫక్కున నవ్వాడు.

"సాధారణంగా ఆడవాళ్ళకు నేను దూరంగా వుంటాను. నిన్ను చూడగానే ఎందుకో మాట్లాడాలనిపించింది."

"నాలో అంత ఆకర్షణ వుందా?" అడిగిందామె వుషారుగా అతడివంక చూస్తూ.

అతడు కారును మెల్లిగా పోనిస్తూ ఆమెవైపు ఓరగా చూశాడు.

"చిన్నతనంలో ఒకమ్మాయి నాతో ఆడుతూ వుండేది! బతికి ఎదిగుంటే ఆమె అచ్చంగా నీలాగే వుండేది. ఆమె పేరు కూడా కమల!"

"ఆమె కేమైంది?"

"ఒకరోజు స్కూల్ నుంచి వస్తూ బస్సుకిందపడి మరణించింది! ఆనాడు నేను చూసిన ఆమె శవం యింకా గుర్తుంది!"

"బాడ్ లక్!" అందామె.

"అటుపైన నేనెవరితోనూ స్నేహం చెయ్యలేదు. నిన్ను చూస్తూంటే ఆ అమ్మాయి నాకు గుర్తొస్తోంది. మీ యిద్దర్కీ పోలికలు బాగా వున్నాయి!"

"ఆమె నాకంటె చిన్నది, నేను పెద్దదాన్ని!"

అతడు తీయగా నవ్వాడు.

"కమలా. నువ్వు నా కళ్ళకు యువతిలా కనబడుతున్నావు! వయస్సు నీ దగ్గరికి రాలేదు!" అన్నాడతను.

"నిజంగా?"

అతడు కారును ఆపాడు. బీచ్ లోపల రోడ్డు మీద కారాగివుంది. దూరంలో సముద్రం, సమీపంలో ఎవ్వరూ లేరు. అతను పక్కకు తిరిగి కూర్చొని ఆమె కళ్ళలోకి చూశాడు.

ఆమె కనురెప్పలు చిట్లించింది. అతడిని తన వైపుకు లాగడానికి కళ్ళతో, చిరునవ్వుతో ప్రయత్నించింది. అతడు అలా చూస్తూనే వున్నాడు.

"ఏమిటలా చూస్తున్నావు?" అడిగిందామె.

"నువ్వు చాలా అందంగా వున్నావు!"

ఆమె గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఆడదాని అందం ఆరాధించే పురుషుడి కళ్ళలో వుంది! ఒకనాడు తను కోల్పోయిన కమలను అతడు తనలో చూస్తున్నాడు.

తటాలున ఆమె అతడి చెయ్యి పట్టుకుని నిమిరింది. సిగ్గుపడ్తూ అతడు ముఖాన్ని పక్కకు తిప్పుకున్నాడు.

"ఇక పోదామా?" అడిగాడు.

"ఎక్కడకు!"

"నిన్ను నీ హోటల్ ముందు దింపి, నేను నా కంపెనీ పని చూసుకుంటాను" అన్నాడతను.

"ఇవాళ సెలవు తీసుకో!"

"నో ప్లీజ్. సాయంత్రం మా బాస్‌ను కల్సుకొని చేసినదంతా చెప్పాలి."

ఆమె అతడి చెయ్యిని మళ్ళా నిమిరింది.

"మోహన్, నీ పని అయినాక నా సూట్‌కి రా. నా గదిలో యిద్దరం డిన్నర్ చేద్దాం."

"చూస్తాను."

"చూస్తానంటే కాదు, చేస్తాననాలి."

అతడామె ముక్కును వేళ్ళతో పట్టుకుని మెల్లిగా నొక్కాడు.

"అలాగే వస్తాను. ఎప్పుడు రావాలి?"

"ఎప్పుడైనా సరే, నీ యిష్టం."

"తొమ్మిదింటికి వస్తాను."

అతను కారును పోనిచ్చాడు. హోటల్ సీవ్యూకి ఫర్లాంగు దూరంలో అతడిని కారాపమని ఆమె దిగి, రోడ్డువారగా వున్న టాక్సీలో ఎక్కింది. కారులోంచి దిగి మోహన్ టాక్సీ దగ్గరకు వెళ్ళాడు.

ఆమె అతడి వంక ఆప్యాయంగా చూసింది.

"ఇది మంచి పద్ధతి! అనవసరంగా పుకార్లు పుట్టించడం నాకిష్టంలేదు. తొమ్మిదింటికి వస్తావుగా?"

"ష్యూర్" అన్నాడతను.

టాక్సీ కదిలింది. మోహన్ తన కార్లో కూర్చుని తలుపు మూసి, సిగరెట్ వెలిగించాడు. మిసెస్ బెనర్జీ తనకు బానిసవుతోంది! త్వరలో ఆమె తనకు లొంగుతుంది. ఆమెకు తను సులువుగా చిక్కిపోకూడదు. ఆమెను ఇంకా యింకా వూరించాలి. ఆమె ఆకల్ని రెచ్చగొట్టాలి.

మోహన్ తన కారును హోటల్ భారత్‌కి పోనిచ్చి కాంపౌండ్‌లో ఆపి, కిందవున్న తన గదికి వెళ్ళాడు. చిన్న గది. చౌకబారు హోటలు.

అతను మంచంమీద పడుకుని ఆమెను గురించి ఆలోచించసాగాడు. పీటర్స్ ఆశించినట్లు ఆమె పదిలక్షలు పెట్టి అతడి కంపెనీలో షేర్లు కొంటుందా? ఎంత ఆలోచించినా జవాబు అతడికి తట్టలేదు.

6

మిసెస్ బెనర్జీ సూట్‌లో లైట్లు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి. ముందు విశాలమైన హాలు. వెనక పడగ్గది. దాని పక్కనే బాత్‌రూమ్.

హాల్లోని సోఫాలో ఆమె కూర్చుంది. టేప్ రికార్డర్ నుంచి సినిమా పాటలు వినబడుతున్నాయి. ఆమె టీపాయ్ వైపు చూసింది. స్కాచ్ విస్కీ బాటిల్, గ్లాసులు వున్నాయి.

ఎవరో తలుపును తట్టారు. హోటల్ బాయ్ వినయంగా ఆమెవైపు చూశాడు. గదిలో యుడీకోలోన్ సువాసన అన్నివైపులా వ్యాపించింది. అన్ని గదుల్లోనూ ఆమె యుడీకొలోన్ స్ప్రే చేయించింది.

"నేనివాళ గదిలోనే డిన్నర్ తీసుకొంటాను. తొమ్మిది తర్వాత నేను చెప్పాక యిద్దరికి డిన్నర్ తేవాలి" అందామె.

"అలాగే, మేడమ్" అని బాయ్ వెళ్ళిపోయాడు.

మోహన్ని గురించి ఆలోచిస్తూ ఆమె టైమ్ చూసింది. ఎనిమిది అయింది. టైమ్ కదలడం లేదనిపించింది.

మోహన్ తన గదికొస్తాడు. గదుల్లో వాళ్ళిద్దరూ తప్ప మరెవ్వరూ వుండరు. అతడిమీద తన ప్రేమను ప్రదర్శించే అవకాశం ఆమెకు పూర్తిగా వుంటుంది.

టెలిఫోన్ మ్రోగింది. తను డిన్నర్‌కి రానని చెప్పడానికి మోహన్ ఫోన్ చేస్తున్నాడేమో! భయంతో వెళ్ళి రిసీవర్ని అందుకుంది.

"హల్లో!" అంది.

"నేను పేర్రాజుని! మీతో అర్జంటుగా మాట్లాడాలి. మీరు ఆఫీసుకు వస్తారనుకున్నాను. రాలేదు" అన్నాడతను.

"మీరెక్కడున్నారు?"

"హోటల్ రిసెప్షన్ హాల్లో."

"పేర్రాజుగారూ, మీరు వెంటనే యింటికి వెళ్ళిపోండి. నేనిప్పుడు ఎవరితోనూ మాట్లాడలేను."

"ఈ నెలలో మా అమ్మాయి పెళ్ళుంది. నాకు ఇరవై వేలు కావాలి. దాన్నిగురించి మాట్లాడ్డానికి వచ్చాను."

ఆమె టైమ్ చూసింది. 8-45 అయింది. పేర్రాజును వెంటనే బయటకు పంపేయాలి!

"రేపు ఆఫీసుకొచ్చి ఆ డబ్బువిషయం నేను చెప్తాను" అందామె.

"రేపు పొద్దుట నేను డ్రాఫ్ట్ తీసి మొగపెళ్ళి వారికి కొంత డబ్బు పంపాలి. మీరు ఆఫీసుకొచ్చేసరికి బ్యాంకి టైమ్ అయిపోవచ్చు" అన్నాడు పేర్రాజు.

"ఎంత పంపాలి?"

"పదివేలు."

"పదివేలు డ్రా చేసి తీసుకోండి. రేపు అంతా మాట్లాడుదాం,"

"థాంక్స్, మిసెస్ బెనర్జీ. రేపు మీరు వస్తారుగా?"

"వస్తాను."

"ఎన్నింటికి?"

జిడ్డు పేర్రాజు! ఆమె విసుక్కుంది.

"ఏదో టైమ్‌లో వస్తాను. పదివేలు తీసుకోమన్నానుగా!" అని ఆమె రిసీవర్ని పెట్టేసింది.

ఆమె సోఫాలో కూర్చుంది. పేర్రాజును గురించి భర్త చెప్పిన మాటలు ఆమెకు జ్ఞాపకొచ్చాయి. ఏదో చెప్పి పేర్రాజు లక్షపైన కంపెనీనుంచి తీసుకొన్నాడు. ఇప్పుడు

మరో పదివేలు! అతడితో రేపు యిదంతా మాట్లాడాలి!

టైమ్ తొమ్మిదైంది. ఆమె సోఫాలోంచి లేచి పడక గదిలోకి నడిచింది. డబుల్ కాట్ మీద ఫోమ్ బెడ్. పైన వెల్ వెట్ దుప్పటి. మెత్తటి తలగడలు. ఆమె గది నలువైపులా చూసింది. ఏర్ కండిషండ్ గది. గది స్వర్గంలా వుంది. మొజయిక్ ఫ్లోర్ మెరుస్తోంది.

ఎవరో తలుపును తట్టారు. ఏర్ కండిషండ్ హాల్లోకి ఆమె పరుగెత్తింది. ఆత్రంగా తలుపు తెర్చింది. హోటల్ మేనేజర్ భట్ బయట నిలబడి వున్నాడు, నవ్వు ముఖంతో.

"మీరు గదిలో డిన్నర్ చేస్తారని తెలిసింది. ఎవరో వస్తున్నారని విన్నాను. స్పెషల్ ఐటమ్స్ ఏమైనా కావాలా?"

"స్వీట్స్, ఫ్రూట్స్ వగైరా పంపండి."

"యిన్ యువర్ సర్వీస్, మిసెస్ బెనర్జీ" అని భట్ వెళ్ళిపోయాడు.

ఆమె తలుపుమూసి, హాల్లోని సోఫాలో చతికిలబడింది. టైమ్ చూసింది. తొమ్మిదీ పది కావస్తోంది. ఇంకా మోహన్ రాలేదు!

కాస్సేపట్లో ఎవరో తలుపును వేళ్ళతో తట్టారు. ఆమె తలుపు తెర్చి బయట నవ్వు ముఖంతో నిలబడివున్న మోహన్ వైపు వుద్రేకంతో చూసింది.

"కమిన్ మోహన్," అందామె.

అతడు గదిలోకొచ్చాక ఆమె తలుపు మూసింది. ఏర్ లాక్ క్లిక్ మంది. అతడికి సోఫా చూపించి ఆమె కూర్చోమని పక్కనే చతికిల బడింది.

ఆమె గుండె వేగంగా కొట్టుకొంటూంది. ఆమె

నవ్వుతూ అతని వంక చూసింది.

"సారీ, ఆలస్యమైంది. మా బాస్ నన్ను ఒకంతట వదల్లేదు."

"డోంట్ బాదర్!" అని ఆమె కిలకిల నవ్వింది.

మోహన్ చూపు ఆమెమీద కేంద్రీకృతమయింది. మిసెస్ బెనర్జీ పల్చటి షిఫాన్ చీర ధరించింది. లోపలి సాటిన్ పావడా అతనికి కనిపిస్తోంది. లోకట్ జాకెట్ నుంచి ఆమె స్తనాలు కొద్దిగా కనిపిస్తున్నాయి. ఆమె జుత్తు నల్లగా మెరుస్తోంది. జుత్తును ఆమె అందంగా సిగ చుట్టుకొంది. నుదురుమీద ఎర్రటి తిలకం. సిగ చుట్టూ మల్లెపూలు.

"నువ్వు ఎన్నింటికి తింటావు?"

"రోజూ పది దాటుతుంది."

"హేవ్ సమ్ డ్రింక్స్," అని ఆమె స్కాచ్ బాటిల్ వైపు చెయ్యి చూపించింది.

అతడు స్కాచ్ విస్కీని రెండు గ్లాసుల్లో పోశాడు. ఆమె రిఫ్రిజిరేటర్ నుంచి మూడు సోడాబుడ్లు తెచ్చి టీపాయ్‌మీద పెట్టింది. అతడు గ్లాసుల్లో కొంచెం సోడా పోశాడు.

ఇద్దరూ గ్లాసులను అందుకున్నారు.

"చియర్స్," అందామె.

"చియర్స్," అన్నాడతను.

"కంపెనీకోసం నేను కొద్దిగా తీసుకొంటాను. విదేశాలలో వున్నపుడు యిది నాకు అలవాటైంది," అన్నదామె.

"విదేశాలలో అందరూ తాగుతారు!" అన్నాడతను.

"నువ్వు విదేశాలకు వెళ్ళావా?" ప్రశ్నించిందామె.

"సింగపూరు వెళ్ళి వచ్చాను. ఇప్పుడు మా బాస్ నన్ను మస్కాట్ కి పంపుతానంటున్నాడు."

"మస్కాట్ యెడారిలాంటి దేశం. అక్కడికెళ్ళి ఏం చేస్తావు?"

"మస్కాట్ సుల్తానకి మా కంపెనీ షేర్లు అమ్మాలి. పదిలక్షల వరకూ అతడు మా కంపెనీలో పెట్టొచ్చు."

"అంతదూరం వెళ్ళడం వృధా! డబ్బున్నవాళ్ళు మన దేశంలోకూడా వున్నారు," అందామె.

"మా బాస్ యెంతచెప్పినా వినడు. ఈ దేశంలో ధనవంతులున్నారని నేనంటే వాళ్ళచేత డబ్బు పెట్టించ మంటాడు."

"మీ కంపెనీ చేసేదేమిటి?"

"మా కంపెనీ అందమైన కాటేజస్‌ను సముద్రపు ఒడ్డున నిర్మిస్తుంది. ప్రతి కాటేజ్ లోనూ డ్రాయింగ్ రూమ్, పడగ్గది, బాత్ రూమ్ వుంటాయి. డాబామీదకు మెట్లు వుంటాయి. మొత్తం రెండువందల కాటేజ్ లు నిర్మించాలని మా ప్లాను. దీనికోసం మద్రాసుకు నలభై మైళ్ళ దూరంలో గోల్డెన్ శాండ్స్ అనే మూడువందల గ్రౌండ్స్ స్థలాన్ని మా కంపెనీ కొంది."

"బాగుంది, ప్రొసీడ్" అందామె.

అతడు రెండు గ్లాసుల్లోనూ మళ్ళా విస్కీపోసి, సోడా కలిపాడు. ఆలోచిస్తూ ఆమె గ్లాసు అందుకొంది. ఇద్దరూ నిషాలోనిండి స్వర్గాన్ని చూడొచ్చు. మోహన్ రాత్రికి యిక్కడే వుండాలి.

"ఆ కాటేజస్‌లో వుండేవాళ్ళకు ఒకపెద్ద హోట లును మా కంపెనీ స్థాపిస్తుంది. అన్నిటికీ సౌకర్యంగా వుంటుంది. సమీపంలో ఒక స్నేక్ పార్కు, మినీ జూ

పెట్టాలని మా ఆశ. ఆ నేలనుండి విదేశీ టూరిస్టులు యీ కాటేజస్‌ను అద్దెకు తీసుకుంటారు. రోజుకు అద్దె వంద రూపాయలు. 200 గదులమీదా అద్దెరూపంలో రోజుకు యిరవైవేలు వస్తుంది. నెలకు 6 లక్షలు. షేర్లు కొన్న వాళ్ళకు బాగా లాభాలు వస్తాయి."

"ఫైన్ స్కీమ్," అందామె.

అతడు సిగరెట్ వెలిగించాడు.

"ఒక కాటేజ్ నేను తీసుకుంటాను. మనిద్దరం అక్కడ హాయిగా వుండొచ్చు," అందామె.

అతడు ఫక్కున నవ్వాడు.

"ఎవరేనా కొనేముందు కాటేజ్‌లను నిర్మించాలి. అది చెయ్యాలంటే పదిలక్షలు పెట్టుబడి కావాలి!"

ఆమె ఆలోచిస్తూ అతడివంక చూసింది.

"మీరు కాటేజస్ కట్టే స్థలం యెక్కడుంది?"

"మహాబలిపురానికి రెండు కిలోమీటర్ల దూరంలో."

"ఆ స్థలాన్ని మనం వెళ్ళి ఒకసారి చూద్దాం" అందామె.

"ఎందుకు?"

"ఆ స్థలం నాకు నచ్చితే మీ కంపెనీలో డబ్బు నేనే పెడ్తాను. అప్పుడు డబ్బుకోసం నువ్వు మస్కట్ దాకా వెళ్ళనక్కర లేదు. అంతదూరం నువ్వెళ్ళడం నా కిష్టం లేదు," అందామె.

అతడామెవైపు ఆప్యాయంగా చూశాడు.

"ఇంతవరకూ మా కంపెనీ విషయాలు మాట్లాడుతూ కాలం వ్యర్థం చేశాం. ఐయామ్ సారీ!" అన్నాడు మోహన్.

"బాగా చెప్పావు," అని ఆమె గ్లాసుల్లో మళ్ళా విస్కీ పోసి సోడా కలిపింది.

పది దాటిందాకా యిద్దరూ తాగుతూనే వున్నారు. ఆమె వుషారుగా లేచి సోఫాలోంచిలేచి రిసీవర్ని ఎత్తింది. తన గదికి వెంటనే డిన్నర్ పంపమని రిసెప్షన్ గుమస్తాతో చెప్పింది.

“యస్ మేడమ్,” అన్నాడతను.

రిసీవర్ పెట్టేసి ఆమె అతడి దగ్గరగా కూర్చుంది. తటాలున చేతుల్తో అతడిని చుట్టేసింది. అతడి కళ్ళల్లోకి చూసింది. అమాంతంగా అతడి పెదిమలను ముద్దెట్టుకుంది.

సిగ్గుపడ్తూ అతడు కొంచెం దూరంగా జరిగాడు. అతడి ఒళ్ళో తలవాల్చి ఆమె వెల్లికిలా పడుకొని మోహన్ వేపు చూసింది.

“కమలా, మనం తొందరపడకూడదు. దేవతలా నిన్ను పూజిస్తాను. సాధారణ మానవుల్లో చెలరేగే కోర్కెలు మనలో తలెత్తకూడదు. నువ్వు నే నారాధించే దేవతవి,” అన్నాడతను వుద్రేకంతో.

ఆ క్షణంలో అతనొక అమాయకుడిలా ఆమె కళ్ళకు కనిపించాడు. అనుభవంలేని యువకుడు! ఎన్నడూ ఆడదాని చెంతకు వెళ్ళని అమాయకుడు!

మోహన్ మళ్ళా స్కాచ్ విస్కీని గ్లాసుల్లో పోసి, సోడా కలిపాడు. అంతమంచి విస్కీ తనకు మళ్ళా దొరకదు. దొరికినప్పుడు తనివితీరా తాగాలి.

“ఇంక నేను తాగను,” అందామె.

“నీకోసం పోసేశాను.”

“రెండు గ్లాసుల్లోదీ నువ్వేతాగు” అందామె.

ఆమె ఎంగిలి గ్లాసులోని విస్కీని అతడు గడగడ తాగేశాడు. ఆమె గాభరాగా అతడివంక చూసింది.

ఎవరో తలుపు తట్టారు. ఆమెవెళ్ళి తలుపు తెర్చింది

చక్రాలున్న డైనింగ్ టేబుల్ని హోటల్ బాయ్ హాలు లోకి తోసుకొచ్చాడు. పదినిమిషాల్లో టేబుల్ని సరిగ్గా అమర్చి, కుర్చీలు వేసి బాయ్ ఆమెవంక చూశాడు.

"నువ్వు వెళ్ళొచ్చు," అందామె.

హోటల్ బాయ్ వెళ్ళిపోయాడు. ఆమె తలుపును మూసింది. టీపాయ్ మీదున్న ఖాళీగ్లాసులవంక చూసింది. అతనిని నెమ్మదిని చేతుల్లోచుట్టి కౌగలించుకుంది.

ఇద్దరూ పొడుగాటి సోఫామీద పడ్డారు. చేతుల్లో చుట్టేశాడు. బాగా తాగడం అలవాటైన అతడిమీద విస్కీ ప్రభావం యెక్కువగాలేదు.

"కమలా, యూ ఆర్ లవ్లీ," అన్నాడతను.

"తిందాం పద," అందామె.

ఇద్దరూ డైనింగ్ టేబుల్ కుర్చీలలో పక్కపక్కనే కూర్చున్నారు. టేబిలుమీదున్న పదార్థాలను చూడగనే అతడి నోరు వూరింది. ఆమె అతడి ప్లేట్లో వడ్డించింది.

"లెటస్ డైన్," అందామె నవ్వుతూ.

7

పొద్దుట యెనిమిదింటికి ఆమెకు మెలుకువ వచ్చింది. పరుపుమీద మోహన్ లేడు. తెల్లారుజామున అతడు తన సూట్లోంచి మెల్లిగా బయటపడి వుంటాడు.

పరుపుమీద దొర్లుతూ ఆమె మోహన్ గురించి ఆలోచించ సాగింది. చాలా హుషారయిన యువకుడు! అతడు తన కిచ్చినంత సుఖాన్ని యింతవరకూ యెవ్వరూ యివ్వలేదు. గతరాత్రి జరిగినదంతా ఆమెకు శాశ్వతంగా జ్ఞాపకముంటుంది.

గదిలోని టెలిఫోను మ్రోగింది. ఆమె రిసీవర్ని అందుకొంది.

"హలో!" అంది.

"కపిలా, నువ్వు యిప్పుడే లేస్తావనుకోలేదు," అన్నాడు మోహన్.

ఆమె సంతోషంగా నవ్వింది.

"ఎప్పుడు వెళ్ళిపోయావు?" అడిగిందామె.

"నాలుగింటికి."

"నన్ను లేపలేదే?"

"నువ్వు హాయిగా నిద్రపోతున్నావు. లేపడానికి మనసొప్పలేదు."

"మోహన్, క్రితం రాత్రి చాలా హాయిగా గడిచింది. ఈ జీవితమంతా అలా సాగితే యెంతో బాగుంటుంది!" అందామె.

"అలా సాగించడానికి మనం ప్రయత్నిస్తే జయిస్తాం" అన్నాడు మోహన్.

కాసేపు యిద్దరూ నిశ్శబ్దంగా వుండిపోయారు.

"బ్రేక్‌ఫాస్టు అయిందా?"

"ఇంకా పళ్ళు తోముకోలేదు," అందామె నవ్వుతూ.

"గోల్డెన్ శాండ్స్ చూడ్డానికి యెప్పుడు వెళ్దాం?"

"అవును. మనం వెళ్ళాలి. పదింటికి నేను కారులో వస్తాను. నువ్వు యెక్కడుంటావో చెప్పు," అందామె.

"నేను నీ హోటల్‌కు ఫర్లాంగు దూరంలో వున్న ఖాదీ బండార్ ముందు వుంటాను."

"ఆల్ రైట్! సరిగ్గా పదింటికి అక్కడికి వొస్తాను. నా కార్లో గోల్డెన్ శాండ్స్‌కు వెళదాం" అందామె.

"ఆల్ రైట్, బై బై" అని అతను రిసీవర్ పెట్టేశాడు.

రిసీవర్ పెట్టేసి ఆమె టైమ్ చూసింది. వేగంగా

పక్కనున్న బాత్ రూమ్‌లోకి పరుగెత్తింది....

పదింటికల్లా కారులో బయలుదేరింది.

మెర్సిడిస్ కారొచ్చి అతడిపక్కనే ఆగింది. తలుపు తెరుచుకుని అతడు ముందు సీటుమీద కూర్చున్నాడు. ఆమె కారును పోనిచ్చింది. స్వయంగా ఆమె కారు నడుపు కుంటూ వచ్చినందుకు అతను సంతోషించాడు.

"మోహన్, ఎలా వెళ్ళాలో నువ్వే చెప్పాలి," అందామె.

"కారును మౌంట్ రోడ్డుకు ముందట పోనీ. అక్కడ నుంచి యెలా వెళ్ళాలో చెప్తాను."

ఆమె హుషారుగా కారుని పోనిస్తోంది. ఆమె నడిపే విధానాన్నిబట్టి కారు డ్రయివింగ్‌లో ఆమె ఆరితేరినదని అతడు గ్రహించాడు. కారు సైదాపేటవైపు దూసుకు పోతోంది. ఆమె అతడిచెయ్యిని పట్టుకుంది.

"మోహన్, ఐ లవ్ యు! నీకోసం ఏదైనా చేస్తాను" అందామె.

అతడామెవైపు దీనంగా చూశాడు.

"నాదగ్గర డబ్బుంటే అదంతా నీ కిచ్చేసేవాడిని," అన్నాడతను.

"నాకు కావలసింది డబ్బుకాదు, ప్రేమించే హృదయం!"

"అది ఎప్పుడో నీదయిపోయింది."

మెర్సిడిస్ కారు చాలా వేగంగా వెళ్తోంది. రోడ్డుమీద జనసంచారం లేదు. ఒక చింతచెట్టు కింద ఆమె కారును ఆపింది. అతడిని కౌగలించుకొని ముద్దెట్టుకొంది. దూరం నుంచి కారుహారన్ వినపడింది. మళ్ళీ ఆమె కారును పోనిచ్చింది.

గోల్డెన్ శాండ్స్! కారులోంచి యిద్దరూ దిగారు. ఆమె నలువైపులా చూసింది. ఎక్కడ చూసినా పొదలు! దూరంలో సరుగుడు చెట్లు. పొదల మధ్యనుంచి ఆమె ముందుకు నడిచింది. కొంచెం దూరంనుంచి సముద్రపు హోరు వినిపిస్తోంది. ఆమె అటువైపు నడిచింది. ఇసుకలో నడుస్తూ సముద్రపు ఒడ్డుకు చేరుకొంది.

అక్కడ నిలబడి పరీక్షగా చూసింది. ఇరోషన్! సముద్రం భూమిని తిని ఆక్రమించుకుంటోంది. గోల్డెన్ శాండ్స్ ప్రదేశంలోకి సముద్రపు నీరు కొన్ని సమయాల్లో జొరబడొచ్చు.

ఆమె అతడివైపు తిరిగింది.

“మీ బాస్ యీ స్థలాన్ని కొన్నాడా?”

“ఎప్పుడో కొనేశాడు.”

ఆమె మౌనంగా కారువైపు నడిచింది. స్టీరింగ్ వెనక కూర్చుంది. అతడు పక్కనే కూర్చుని తలుపుమూశాడు. ఆమె కారును పోనిచ్చింది.

రోడ్డుమ్మట కారు కదుల్తోంది. ఆమె ఓరగా అతడి వంక చూసింది. “మోహన్, యీ కంపెనీలో నువ్వెంత కాలంనుంచి పని చేస్తున్నావు?”

“రెండు నెలలనుంచి.”

“పదిలక్షల విలువగల షేర్లు అమ్మితే మీకేమిటొస్తుంది?”

“వెయ్యి జీతంతో నాకు ఉద్యోగం వుంటుంది. యాభైవేలు నాకు కమీషన్ కంపెనీ యిస్తుంది.”

“ఈ ప్లాన్ ఫలించదు. ఇక్కడ కాటేజస్ నిర్మించడం మూర్ఖత్వం. సముద్రం ముందుకొచ్చి గోల్డెన్ శాండ్స్ అంతా జలమయం కావచ్చు. మీ బాస్ యీ

ప్రదేశాన్ని చూపించి ప్రజల్ని మోసం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు. నువ్వీ వుద్యోగం వదిలేయి. నేను మరో ఉద్యోగం యిప్పిస్తాను," అందామె.

"చూద్దాం," అన్నాడతను.

"మీ బాస్ పేరు?"

"పీటర్స్."

"అతడు ఎక్కడుంటున్నాడు?

"నువ్వున్న సీవ్యూ హోటల్లోనే."

"ఎలా వుంటాడతను?"

"పొట్టిగా, నల్లగా, లావుగావుంటాడు. బాల్డ్ హెడ్."

"హోటల్ డైనింగ్ హాల్లో అతడిని చూశాను. అతడిని గురించి పూర్తి సమాచారం నేను కనుక్కుంటాను," అందామె.

ఖాదీబండార్ ప్రాంతంలో ఆమె కారును ఆపింది. అతను దిగాడు. ఆమె అతడివంక నవ్వుతూ చూసింది.

"నాకు ఫోన్ చెయ్యి. మళ్ళా కల్సుకుందాం," అందామె.

మెర్సిడిస్ కారు పోయాక అతడు తన ఫియట్ కారు వైపు నడిచాడు. ఆమెలో అంతమార్పు ఎలా వచ్చింది? ఆమె తనను అనుమానిస్తోందా? తన్నింత సులువుగా వదిలి ఆమె ఎందుకెళ్ళిపోయింది?

మోహన్ తన ఫియట్ కారువైపు నడిచాడు. ఆలోచిస్తూ కారులో కూర్చుని తలుపు మూశాడు. తన కోర్కె తీరాక ఆమె తనని వదిలేయడానికి ప్రయత్నిస్తోందా?

8

పీటర్స్ అతడివంక సీరియస్‌గా చూశాడు.

"సిడ్నాన్! నిన్నరాత్రి నువ్వామె గదిలో వున్న

కొన్నావు! ఆమె పూర్తిగా నీ బానిసైందా?"

"మేం చేసేదంతా స్పయ్‌లా చూస్తున్నారా?"

"అది ప్రస్తుతం అనవసరం. ఆమె డబ్బు పెడ్తోందా?"

మోహన్ సిగరెట్ వెలిగించాడు.

"పెడ్తుందని ఆశించాను. కాని చివరకి మన ప్లాన్ బోల్తా కొట్టింది. గోల్డెన్ శాండ్స్ ప్రోజక్ట్ ఫలించదని ఆమె అంటోంది. ఆమె నాతో వచ్చి ఆ స్థలాన్ని చూసింది.... ప్రజలను మీరు మోసం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నారని అందామె. మీగురించి అంతా కనుక్కుంటానంది."

పీటర్స్ గాభరాగా కుర్చీలోంచి లేచాడు.

"యూ ఫూల్! ఆమె నాగురించి కనుక్కోడం మన కంపెనీకి మంచిది కాదు!" అని పీటర్స్ ఆలోచిస్తూ అతడి వంక చూశాడు.

"గతరాత్రి జరిగినదంతా చెప్పు!"

మోహన్ చెప్పాడు. పీటర్స్ మౌనంగా విన్నాడు. తను ఏదో చెయ్యాలి. మిసెస్ బెనర్జీ ధనవంతురాలు. ఆమె ఏదైనా చెయ్యగలదు. పీటర్స్ సూటిగా అతడివంక చూశాడు.

"మోహన్, త్వరలో ఆమె నిన్ను మర్చిపోతుంది. అన్నం తినేసిన విస్తరిలా నిన్ను రోడ్డు పక్కన పారేస్తుంది. ఒక విధంగా వెళ్తే మనకామె డబ్బునిస్తుంది. అది మనం పంచుకుని పారిపోవచ్చు!"

"ఏం చేద్దాం?"

"నిన్ను ఎత్తుకుపోయి ఒకచోట దాచేస్తాను. ఐదు లక్షలిస్తే నిన్ను వదిలేస్తానని చెప్తాను. ఆమె కోర్కె యింకా పూర్తిగా తీరలేదు. ఈ సమయంలో నీకోసం

ఆమె డబ్బు యిస్తుంది. అది యిద్దరం పంచుకుందాం. వెంటనే యీ పట్నం విడిచి పోదాం!"

"గుడ్ ఐడియా!" అన్నాడు మోహన్.

మోహన్‌కి వుద్యోగమంటే పరమ అసహ్యం. జీవితం హాయిగా సాగాలి, శ్రమపడకుండా!

"నేను ఆలోచించి ప్లాన్ తయారుచేస్తాను. ఆలా చేద్దాం" అన్నాడు పీటర్స్.

"ఆల్ రైట్! కాని ఆమెకు ప్రమాదం రాకూడదు."

"ఎవ్వరికీ ప్రమాదం రాదు" అన్నాడు పీటర్స్.

9

ఆతడి ఒళ్ళో తల పెట్టుకుని ఆమె అతడివంక చూస్తోంది. మోహన్ విస్కీ తాగుతున్నాడు.

"మోహన్, పీటర్స్‌గురించి తెల్సుకున్నాను. రెండేళ్ళ క్రితం డిగ్ వెల్స్ అని అతడో కంపెనీ పెట్టాడు. పల్లె ప్రజల నుంచి యిరవైవేలు వసూలుచేసి మాయమయ్యాడు. ఆరునెలలు జైల్లో వుండి యీ మధ్యనే విడుదలయ్యాడు. ఇప్పుడు పెద్ద పెట్టున ప్రజలను మోసగించడానికి ప్రయత్నిస్తున్నాడు" అందామె.

అతడు ఆశ్చర్యపోయాడు.

"ఇదంతా నీకెలా తెలిసింది?"

"మాకో సబ్సిడరీ యిన్‌వెస్టిగేటింగ్ కంపెనీ వుంది. ఎవర్ని గురించైనా వాళ్ళు కొన్ని గంటల్లో తెల్సుకోగలరు" అందామె.

"నా గురించికూడా తెల్సుకొన్నావా?"

"నేను తెల్సుకుంటున్నానుగా, స్వయంగా" అని ఆమె లేచి అతడిని ముద్దెట్టుకొంది.

మోహన్ ఆమెవైపు ప్రేమతో చూశాడు.

"నేనా కంపెనీలో వుద్యోగం మానేశాను" అన్నాడతను.

"గుడ్ వర్క్" అందామె.

డిన్నర్ ముగించి, యిద్దరూ పడగదిలోని డబుల్ కాట్ మీద పడుకున్నారు. డిమ్ గ్రీన్ లైట్ వెలుగుతోంది.

"మోహన్, నువ్వెప్పుడూ నాతోనే వుండాలి" అందామె.

"నిన్ను వదిలి నేను వుండలేను" అన్నాడు మోహన్.

"మనం రిజిస్టర్ మేరేజి చేసుకుందాం" అందామె.

మోహన్ షాక్ తిన్నాడు. మాట్లాడలేదు. ఆమె చెయ్యిని మెల్లిగా నిమిరాడు.

అంతలో ఏదో అలికిడైంది.

డిమ్ లైట్ కాంతిల్లో దయ్యాల్లా కనిపిస్తూన్న ముగ్గురు వ్యక్తులవైపు ఆమె గాభరాగా చూసింది. ముగ్గురూ మాస్కులు ధరించారు.

"మేడామ్, నువ్వు కదిలితే ప్రమాదం!" అర్చాడు ఒకతను.

మోహన్ని బంధించి వాళ్ళు అతడిని లాక్కుపోయారు. కాస్సేపట్లో ముందు తలుపు క్లిక్ మంది.

ఆమె హాల్లోకి పరుగెత్తింది. తలుపు తెర్చి నడవ పొడుగునా చూసింది. నడవలో ఎవ్వరూ లేరు. వాళ్ళు లిఫ్ట్లో క్రిందకు వెళ్ళారేమో!

తలుపుమూసి ఆమె సోఫాలో కూర్చుండిపోయింది. వాళ్ళు లాక్కుపోతుంటే మోహన్ తనవైపు విసిరిన గాభరాచూపు ఆమెకు గుర్తుకొచ్చింది. వాళ్ళు మోహన్ని ఎందుకు ఎత్తుకుపోయారు? అతడిని వాళ్ళు ఏం చేస్తారు?

ఆమె టైమ్ చూసింది. ఒంటిగంట దాటింది. తనిప్పుడు

ఏమీ చెయ్యలేదు. తెల్లారాక మోహన్ని కాపాడ్డంకోసం తను ప్రయత్నించాలి!

టైమ్ రెండు దాటింది. నిద్రబట్టక ఆమె పరుపుమీద యిటూ, అటూ దొర్లుతోంది. టెలిఫోన్ మ్రోగింది.

ఆమె రిసీవర్ని ఎత్తింది.

"హలో!" అందామె.

"మిసెస్ బెనర్జీ, మోహన్ మా దగ్గర క్షేమంగా వున్నాడు. అతడి కంఠం వింటావా?" అని ప్రశ్నించాడతను.

"వింటాను!" అందామె.

అటువైపు నుంచి మోహన్ అరుపులు వినపడ్డాయి.

"కమలా, వీళ్ళు నన్ను చిత్రవధ చేస్తున్నారు! ప్లీజ్ నన్ను రక్షించు" అని అతను ఏడ్వసాగాడు.

"మిసెస్ బెనర్జీ, విన్నావా?" అంది అటువైపు కంఠం.

"మిస్టర్ నీకేం కావాలి?" అడిగిందామె.

"ఇతడు నీ ప్రియుడని నాకు తెలుసు. అతడు నీకు కావాలంటే ఐదు లక్షలు మాకు చెల్లించాలి. అప్పుడు అతడిని వదిలేస్తాం."

ఆమె క్షణకాలం ఆలోచించింది.

"అంత డబ్బు యివ్వడానికి నాకు టైమ్ కావాలి."

"కొన్ని గంటల్లో తెల్లారుతుంది. సాయంత్రం ఏడు లోపల నాకు డబ్బు కావాలి."

"మిస్టర్, అలాగే యిస్తాను. అతనికి ఏ ప్రమాదమూ రాకూండా చూడు. అతడిని హింసించకు!"

"మిసెస్ బెనర్జీ, ఏ రూపంలో ఇతన్ని మీ గదిలోంచి తీసుకుపోయామో, అదే రూపంలో అతడిని వదిలేస్తాం."

"నేను డబ్బు ఎలా యివ్వాలి?"

"రేపు ఫోన్ చేసి చెప్తాను. పోలీస్ రిపోర్టిస్తే ఇతని ప్రాణానికి ప్రమాదం!" అని అతడు రిసీవర్ని పెట్టేశాడు.

ఆమె రిసీవర్ని పెట్టేసి కాస్సేపు ఆలోచించింది. పాంట్, స్లాక్ వేసుకొంది. తలమీద కాప్ పెట్టుకుని, బాగ్‌లో వున్న పిస్టల్ని పాంట్ జేబులో దాచుకుని బయటకు నడిచింది. తలుపు మూసింది. ఏర్‌లాక్ క్లిక్‌మంది.

ఆమె నడవమ్మట నడిచింది. నడవ లైట్లు డిమ్‌గా వెలుగుతున్నాయి. నడవ మధ్యలో మేడమెట్లు వున్నాయి. మెట్లకు యిటువైపున లిఫ్ట్ వుంది. రాత్రిళ్ళు పన్నెండు తర్వాత లిఫ్ట్ వుండదు. అందరూ మెట్లమ్మట పైకి వెళ్ళవలసిందే!

వాళ్ళు వెళ్ళగానే తను బైటకెళ్ళి చూసింది. లిఫ్ట్‌లో వాళ్ళు వెళ్ళుండరు. మెట్లవైపు వెళ్ళుంటే వాళ్ళు ఆమెకు కనిపించి వుండేవారు. వాళ్ళు ఏమయ్యారు? సమీపంలో వున్న ఏ గదిలోకయినా వెళ్ళారా?

ఆలోచిస్తూ ఆమె మెట్లమ్మట కిందకు దిగింది. కిందనున్న హాలులోకి ప్రవేశించింది. హాలులో ఎవ్వరూ లేరు. రిసెప్షన్ వెనక ఒక యువకుడు మాత్రం కునికిపాట్లుపడ్తూ కూర్చున్నాడు. ఆమెను చూసి అతను వులిక్కిపడుతూ లేచాడు.

"ఐయామ్ మిసెస్ బెనర్జీ," అంది.

"మేడమ్, ఏంకావాలో చెప్పండి."

"పీటర్స్ ఏ గదిలో వుంటాడు?"

"సాయంత్రం ఆయన గది ఖాళీచేసి వెళ్ళిపోయాడు"

"ఆయన వెళ్ళాక యీ హోటల్లో ఎవరెవరు గదులు తీసుకున్నారు?"

అతడు బుక్ చూసి ఆవిడవంక తిరిగాడు.

"ఇద్దరు తీసుకున్నారు మేడమ్."

"వాళ్ళను వర్ణించగలవా?"

"ఒక విదేశీ స్త్రీ, ఆమెకూతురు గది తీసుకున్నారు. పొట్టిగా, లావుగావున్న గడ్డంవ్యక్తి గది తీసుకున్నాడు."

"వాళ్ళు ఏ గదుల్లో వున్నారు?"

"అతడు నంబర్ 82లో వున్నాడు. ఆవిడ 22నంబరు గదిలో వుంది."

ఆమె తీవ్రంగా ఆలోచించింది. అతడివంక నవ్వుతూ చూసింది. జేబులోంచి యాభై రూపాయలనోటు తీసి పట్టుకుంది.

"గడ్డంవ్యక్తి గదిలో నిద్రపోతూంటాడు," అంది.

అతడు తలాడించాడు.

"అతడి గదికి మరో కీ మీ దగ్గరుంటుందిగా?"

"అది ఎవ్వరికీ యివ్వకూడదు."

చేతిలోని నోటును ఆమె కౌంటరుమీద పెట్టింది.

"నీకు ప్రమాదం లేకుండా నేను ఆ గదిలోకి వెళ్ళి వస్తాను. ఈ డబ్బు నీది" అంది.

అతడు నోటును దాచుకున్నాడు.

"చప్పుడయితే అతడు లేవచ్చు" అన్నాడు గుమస్తా.

"చప్పుడు చెయ్యను" అంది.

అతనిచ్చిన తాళంచెవిని తీసుకొని మెట్లమ్మట పైకి వెళ్ళింది. తన సూట్ సమీపంలో వుంది రూమ్ నెంబరు 82. గదిముందు నడవలో నిలబడి యిరువేపులా చూసింది.

తాళం చెవిని తిప్పి, తలుపును తోసుకుని మెల్లిగా లోప
లకు వెళ్ళింది.

గదిలో లైట్ డిమ్‌గా వెలుగుతోంది. ఎదురుగావున్న బెడ్ వైపు చూసింది. ఎవరో గాఢనిద్రలో వున్నారు. అటువైపుకు తిరిగి నిద్రపోతున్నాడు.

ఆవిడ మెల్లగా మంచం దగ్గరకు నడిచింది. చడీ చప్పుడు లేకుండా అటువైపుకువెళ్ళి నిద్రపోతున్న వ్యక్తి వైపు చూసింది.

ఆవిడ వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది. మెల్లిగా తలుపును లాగింది. ఏర్ లాక్ క్లిక్కుమంది. రిసెప్షన్ గుమస్తాకు తాళంచెవిని యిచ్చేసి, ఆమె తన సూట్‌కు గబగబా నడిచి వెళ్ళిపోయింది.

10

మధ్యాహ్నం రెండింటికి టెలిఫోన్ మ్రోగింది. ఆమె రిసీవర్ని అందుకొంది.

"హలో, మిసెస్ బెనర్జీ," అంది.

"డబ్బు రెడీగా వుందా?"

"ఉంది."

"పోలీసు రిపోర్టు యివ్వలేదుగా?"

"పోలీసు సహాయంకోరే అలవాటు నాకులేదు."

"గుడ్! చీకటిపడ్డాక యేడింటికి సీవ్యూ హోటల్ పైడాబా మీదకు వెళ్ళు. అక్కడ యెవ్వరూ వుండరు. డబ్బున్న బాగ్‌ను ఓవర్ హెడ్ టాంకు మూతపైన పెట్టి వెళ్ళిపో. మోహన్ గంటలో నీ గదికొస్తాడు."

"అలాగే."

"నన్ను మోసంచేస్తే మోహన్ చస్తాడు."

"ప్లీజ్ మోహన్ని చంపొద్దు," అంది.

"నేను చెప్పింది చేస్తే అతను చావడు," అని అటు వైపు వ్యక్తి రిసీవర్ని పెట్టేశాడు.

ఆమె పేర్రాజుకు ఫోన్ చేసింది.

"హలో," అన్నాడతను.

"పేర్రాజుగారూ, మిసెస్ జెనర్జీ! నాకు నలుగురు గూండాలు అర్జంటుగా కావాలి. నలుగురూ సూట్లలో పెద్దమనుషుల్లా వుండాలి. వాళ్ళను ఆరింటికి నా సూట్ కి పంపండి."

"అలాగే పంపుతానమ్మా" అన్నాడు పేర్రాజు.

ఆమె రిసీవర్ని పెట్టేసింది.

టైమ్ ఆరు కావస్తోంది. మిసెస్ జెనర్జీ గ్లాసులో విస్కీ పోసుకుని సోడా కలుపుకుని తాగేసింది. ఎవరో తలుపును తట్టారు. ఆమె వెళ్ళి తలుపు తెరిచింది. నలుగురు వ్యక్తులు లోపలకు వచ్చారు. ఆమెకు నమస్కరించారు.

"ఆ సోఫాలలో కూర్చోండి. ఏం చెయ్యాలో తరువాత చెప్తాను" అంది.

"అలాగేనమ్మా," అన్నారు వాళ్ళు.

ఆమె పడగ్గదిలోకి వెళ్ళిపోయింది.

సరిగా ఏడింటికి ఆమె బాగ్ పట్టుకొని గదిలోంచి బయటకు నడిచింది. పదినిమిషాలలో తిరిగి తన గదికి వచ్చింది.

సోఫాల్లో కూర్చున్న గూండాలకు ఆమె సౌంజ్ఞ చేసింది. ఆమె వెనకనే వాళ్ళు కదిలారు. రూం నంబరు 82 ముందు ఆగింది. తలుపు దగ్గరగా మూసివుంది. తలుపు తోసి ఆమె లోపలకు వెళ్ళింది.

సోఫాలో కూర్చుని విస్కీ సేవిస్తున్న మోహన్ ఆమెను చూసి వులిక్కిపడ్డాడు. అతడికెదురుగా సోఫాలో

కూర్చుండామె.

"మోహన్, అతడికి డబ్బిచ్చేశాను. సువ్వికడున్నావని నాతో చెప్పి అతడు వెళ్ళిపోయాడు." అబద్ధమాడిందామె.

మోహన్ నోటమ్మట మాట పెగల్లేదు.

"నిన్ను తీసుకెళ్ళడానికి వచ్చాను," అంది.

తలుపుమూసి అక్కడ నిలబడిన నలుగురివైపు చూశాడతను.

"వాళ్ళెవరు?"

"నా మనుషులే!"

"ఆ మోసగాడికి డబ్బెందుకిచ్చావు?"

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"అందులో సగం నీ కొస్తుందనే నమ్మకంతో."

బయట బూట్ల చప్పుడైంది. నలుగురు గూండాలతో ఆమె బాత్ రూమ్‌లోకి దూరింది. తలుపును కొద్దిగా తెర్చివుంచింది.

పొట్టిగా లావుగావున్న గడ్డం వ్యక్తి కోపంగా లోపలకొచ్చాడు. "మోహన్, ఆమె నాతో అబద్ధం చెప్పింది. ఏడు గంటలకు బాగ్ పట్టుకొని నా గదిముందునుంచి వెళ్ళడంచూసి డబ్బు పట్టుకెళుతోందని అనుకున్నాను. పైకెళ్ళి చూస్తే బాగ్ లేదు. మన ప్లాన్ మిస్‌ఫైర్ అయింది. నేను నీకిచ్చినదంతా వేస్టెడ్" అర్చాడతను.

ఆమె గదిలోకొచ్చింది. వెనకనే గూండాలు నిలబడ్డారు.

"మిస్టర్ పీటర్స్, నువ్వు దగాకోరువని నాకు తెల్సు. నువ్వు, మోహన్ కలిసి నన్ను చీట్ చెయ్యాలనుకొన్నారు. ఇన్ని కంపెనీలను నడిపే మిసెస్ బెనర్జీని

మోసం చెయ్యడం అంత సులువయిన పనికాదు" అంది వ్యంగ్యంగా.

పీటర్స్, మోహన్ మౌనంగా వుండిపోయారు.

"మిస్టర్ పీటర్స్, పోలీసు రిపోర్టివ్వనని నీతో అన్నాను. కాని మీలాంటివాళ్ళని శిక్షించాలి!" అని గూండాలవైపు చూసింది.

ధీమాగా గుమ్మంవైపు నడిచింది. వెనుదిరిగి మళ్ళా గూండాలవైపు చూసింది.

"వాళ్ళిద్దర్నీ బాగా చితక్కొట్టండి. అరవకుండా జాగ్రత్త పడండి. మీరు చెయ్యవలసిన పని అంతే. పని పూర్తయ్యాక మీరు వెళ్ళిపోవచ్చు!" అని ఆమె తలుపును తెర్చింది.

"కమలా, నన్ను కొట్టించకు ప్లీజ్!" అర్చాడు మోహన్.

"షటప్ రాస్కెల్!" అని ఆమె బయటికెళ్ళి తలుపును గట్టిగా మూసింది.

ఏర్ లాక్ క్లిక్ మంది.

—:ఐపోయింది:—